www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

సోమవారం
26.10.2026





భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు ఒప్పందం ప్రకారం నాణ్యమైన సన్న రకం బియ్యం సరఫరా చేయకుండా, నాసిరకం దొడ్డు బియ్యాన్ని అప్పగించి కోట్లాది రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండికొట్టేందుకు యత్నించిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అధికారులు అరెస్ట్ చేశారు. పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని సుమారు 16 రైస్ మిల్లులపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి లోతైన దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి, ఇతర రాష్ట్రాల నుంచి చౌకగా కొనుగోలు చేసిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాములకు చేర్చినట్లు ల్యాబ్ పరీక్షల్లో శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో పోలీసులు వీరిపై కఠిన చర్యలు చేపట్టారు. సమయానికి అధికారులు స్పందించి సేకరణ నిలిపివేయడంతో వందల కోట్ల మేర ప్రభుత్వ నష్టం తప్పినప్పటికీ, ఈ కుంభకోణం వెనుక పౌరసరఫరాల శాఖలోని అధికారుల పాత్రపై కూడా సీఐడీ ఆరా తీస్తోంది.

-కలంజ్యోతి, హైదరాబాద్

- సన్న బియ్యం సరఫరాలో మోసం
- 14 మంది రైస్ మిల్లర్ల అరెస్ట్
- సన్నాలకు బదులు దొడ్డు బియ్యం సరఫరా!
- మూడు జిల్లాల్లో 3,385 టన్నుల అక్రమాలు!
- రూ.242 కోట్ల నష్టం నివారణ
- ప్రభుత్వ అధికారుల ప్రమేయంపై ఆరా!

సన్నాలకు బదులు దొడ్డు బియ్యం

14 మంది రైస్ మిల్లర్ల అరెస్ట్

2లో..

టీజీఎస్ఆర్టీసీ సరికొత్త వీక్లీ పాస్

రూ.600కే వారమంతా బస్సు ప్రయాణం

- ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించే వెసులుబాటు
- పుష్పక్ బస్సులకు మినహాయింపు
- సిటీ బస్ పాస్ కౌంటర్లలో లభ్యం

2లో..

హైదరాబాద్ నగర ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సరికొత్త వీక్లీ బస్ పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ.600 చెల్లించి ఏసీతో సహా నగరంలోని అన్ని సాధారణ బస్సుల్లో వారం రోజుల పాటు అపరిమితంగా ప్రయాణించే వెసులుబాటును కల్పించగా, శంషాబాద్ విమానాశ్రయ పుష్పక్ బస్సులకు మాత్రం మినహాయింపునిచ్చింది. తరచూ రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థుల ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో తెచ్చిన ఈ పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో లభిస్తాయని అధికారులు వెల్లడించారు.

-కలంజ్యోతి, హైదరాబాద్





రాహుల్ గాంధీకి రేవంత్ ఏటీఎం కార్డు

- స్కామ్‌లపై రాహుల్‌గాంధీ మౌనం
- సంక్షేమ పథకాలపై మాట తప్పారు
- 2028లో కేసీఆరే మళ్లీ సీఎం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో..

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజాపాలనను గాలికొదిలేశారని, రాష్ట్రంలో సాగుతున్న కుంభకోణాలు, అవినీతి సొమ్ము ఢిల్లీకి చేరుతుండటం వల్లే రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామని, మరో ఏడాదిన్నరలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కలంజ్యోతి, హైదరాబాద్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
సోమవారం 26.10.2026
www.kalamjyothi.com

సన్నాలకు బదులు దొడ్డు బియ్యం

14 మంది రైస్ మిల్లర్ల అరెస్ట్

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 26) : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ మోసానికి పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) పోలీసులు అరెస్ట్ చేశారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఒప్పందం ప్రకారం ఎఫ్‌సీఐకి నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం దొడ్డు బియ్యాన్ని అక్రమంగా అందజేసినట్లు వీరిపై తీవ్ర అభియోగాలు నమోదయ్యాయి. పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న లిఖితపూర్వకంగా అందజేసిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సీఐడీ ప్రత్యేక విభాగం అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు.

సన్నాలకు బదులు దొడ్డు బియ్యం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కస్టమ్ మిల్లింగ్ కోసం తమకు కేటాయించిన అత్యంత విలువైన సన్నరకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి చాలా తక్కువ ధరకు కొనుగోలు చేసిన నాసిరకం దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాములకు తరలించి అప్పగించారు. అనుమానం వచ్చిన అధికారులు అక్కడి నుంచి సేకరించిన బియ్యం నమూనాలను ప్రయోగశాలలో సమగ్రంగా పరీక్షించగా, అవి ప్రభుత్వం నిర్దేశించిన సన్న రకం కాదని, పూర్తిగా నాసిరకం దొడ్డు రకమని నివేదికల్లో నిర్ధారణ అయ్యింది.

3 జిల్లాల్లో 3,385 టన్నుల అక్రమాలు..

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని సుమారు 16 రైస్ మిల్లులు సన్న బియ్యం స్థానంలో దాదాపు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు సీఐడీ ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సన్న బియ్యం సరఫరా పేరిట ప్రభుత్వానికి బోనస్ రూపంలోనే సుమారు రూ.1.69 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ దందాతో ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టేందుకు మిల్లర్లు పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు స్పష్టమైంది.

రూ.242 కోట్ల నష్టం నివారణ..


ఈ భారీ మోసాన్ని సకాలంలో గుర్తించిన పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు. తక్షణమే సంబంధిత మిల్లుల నుంచి బియ్యం సేకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడంతో పాటు చెల్లింపులను నిలిపివేశారు. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని ముందస్తుగానే సమర్థవంతంగా నివారించగలిగారు.

ప్రభుత్వ అధికారుల ప్రమేయంపై ఆరా..

ఈ భారీ కుంభకోణంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన



సీఐడీ అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. బియ్యం అక్రమ మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిబంధనల ఉల్లంఘన, పక్కా పథకం ప్రకారం చేసిన క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ కొనసాగిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున బియ్యం సరఫరా జరుగుతున్నా గుర్తించకపోవడం వెనుక ఎవరైనా పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక సిబ్బంది ప్రమేయం ఉందా అనే కోణంలోనూ సీఐడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.



టీజీఎస్ఆర్టీసీ సరికొత్త వీక్లీ పాస్

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 25) : హైదరాబాద్ నగరంలో బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక వీక్లీ బస్ పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో నిరంతరాయంగా అపరిమిత ప్రయాణం చేసే వెసులుబాటును కల్పించింది.

ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించే వెసులుబాటు..

ఈ కొత్త పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో రాకపోకలు సాగించే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.

పుష్పక్ బస్సులకు మినహాయింపు..

నగరంలోని సాధారణ సర్వీసులన్నింటికీ ఈ పాస్ వర్తించినప్పటికీ, శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఇది వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. విమానాశ్రయ బస్సు మినహా మిగిలిన అన్ని సిటీ సర్వీసుల్లో నిరభ్యంతరంగా రాకపోకలు సాగించవచ్చని తెలిపారు.

సిటీ బస్ పాస్ కౌంటర్లలో లభ్యం..

ప్రయాణికులపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడంతో పాటు సిటీ బస్సుల్లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త పాస్‌లు నగర పరిధిలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో ప్రయాణికులకు నేరుగా లభిస్తాయని అధికారులు తెలిపారు. తరచూ బస్సుల్లో తిరిగే ఉద్యోగులు, విద్యార్థులు, చిరువ్యాపారులకు ఈ వెసులుబాటు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది.



రాహుల్ గాంధీకి రేవంత్ ఏటీఎం కార్డు

- కాంగ్రెస్ హామీలు గాలికొదిలేసింది
- స్కామ్‌లపై రాహుల్‌గాంధీ మౌనం
- రేవంత్ కుటుంబంపై భూ ఆరోపణలు
- సంక్షేమ పథకాలపై మాట తప్పారు
- వైఫల్యాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- 2028లో కేసీఆరే మళ్లీ సీఎం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 25) : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను పూర్తిగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ చేరిక సందర్భంగా ఆయన ప్రసంగించారు.

స్కామ్‌లపై రాహుల్ గాంధీ మౌనం..

రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి యథేచ్ఛగా సాగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని ఆరోపించారు. దేశమంతా తిరుగుతూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రభుత్వ వైఫల్యాలు, నిరుద్యోగుల సమస్యలు ఆయనకు పట్టడం లేదని, అందాల్సినవి సక్రమంగా అందుతుండటంతోనే రాష్ట్రంలో జరుగుతున్న స్కామ్‌లపై నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు.

సంక్షేమ పథకాలపై మాట తప్పారు..

ఎన్నికల సమయంలో అశోక్‌నగర్ టీ స్టాల్ వద్ద నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భరోసా ఇచ్చిన రాహుల్ ఇప్పుడు వారిని విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ పేరిట రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని పక్కన పెట్టారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను నెలకు రూ.4,000 చేస్తామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పూర్తిగా మాట తప్పారని ఆక్షేపించారు.

రేవంత్ కుటుంబంపై భూ ఆరోపణలు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన సోదరుడికి కట్టబెట్టారని, అమెరికాలో ఉండే మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై తీవ్ర సందేహాలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

వైఫల్యాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు..

ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన పాలకులు తిట్లు, అక్రమ కేసులతో ప్రతిపక్ష నాయకులను బెదిరించే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, ప్రజా ప్రయోజనాలను కాపాడే సత్తా బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు.

2028లో కేసీఆరే మళ్లీ సీఎం..

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని తెలిపారు. మరో ఏడాదిన్నర కాలంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2028 ఎన్నికల్లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారని, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడతామని స్పష్టం చేశారు.


కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

సోమవారం 26.10.2026

www.kalamjyothi.com



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

అండగా నిలిచిన తోటి మిత్రులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 25) : చెన్నారావుపేట మండలంలోని ముగ్ధంపురం గ్రామంలో స్నేహితుడి కుటుంబానికి ఎస్ఎస్సీ 1995-96 బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు ఆదివారం ఆర్థిక చేయూత అందించారు. ముగ్ధంపురం గ్రామానికి చెందిన ఆరెల్లి ప్రభాకర్ తండ్రి ఆరెల్లి యాకయ్య (78) ఇటీవల అనారోగ్యంతో ఈ నెల 16న మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభాకర్ పాఠశాల మిత్రులు గ్రామానికి చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత దివంగత యాకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అండగా నిలిచిన తోటి మిత్రులు..

స్నేహితుడి కుటుంబానికి ధైర్యం చెబుతూ తాము సేకరించిన రూ.15,600 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ ఆపద సమయంలో తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట ఎస్ఎస్సీ 1995-96 బ్యాచ్ మిత్రులు పాతముగ్ధంపురం సర్పంచ్ ననుమాస కరుణాకర్ గౌడ్, ముగ్ధంపురం మాజీ సర్పంచ్ పెండ్యాల ప్రభాకర్, కుండె కుమారస్వామి, సంకటి రాజేంద్రప్రసాద్, చల్ల రాజు, గట్ల రాంబాబు, నన్నెబోయిన కుమారస్వామి, డాక్టర్ వెల్దండి మధు, డాక్టర్ అమ్మ రవి, కోల రమేష్, శ్రీనివాస్, రమేష్, అనిల్, వీరభద్రయ్య, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి

- కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయి
- నష్టపరిహారంతో రైతులను ఆదుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 25) : వ్యవసాయానికి సరైన విద్యుత్ సరఫరా లేక బావుల కింద సాగు చేస్తున్న పంటలు నిలువునా ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట రూరల్ మండలంలోని గురిజాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బావుల కింద సాగు చేస్తున్న పంటలను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురిజాల గ్రామంలో పలువురు రైతులు వరితో పాటు ఇతర పంటలను ఎంతో వ్యయప్రయాసలకోర్చి సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే విద్యుత్ కోతలు, నాణ్యత లేని సరఫరా వల్ల మోటార్లు నడవక సకాలంలో నీరు అందడం లేదని, దీంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు.

నష్టపరిహారంతో రైతులను ఆదుకోవాలి..

ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారుల తో పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింగం, మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, బండారి చిన్న వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు బండారి మల్లయ్య, కొమ్మ రవి, యశోద నర్సింగం, ఆరె సుధాకర్, శ్రీరామోజు మధుకరాచారి, పుంజాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



చందు హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

NHRC జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 25) : నర్సంపేట పట్టణంలోని కొమురం భీం కాలనీలో నివాసముంటున్న గురిజాల గ్రామానికి చెందిన గణిపాక చందు హత్యకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు గణిపాక అశోక్, జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. చందు గత ఐదేళ్లుగా కొమురం భీం కాలనీలో ఉంటూ పట్టణంలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 21వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో కొంతమంది యువకులు ఫోన్ చేసి చందును బయటకు పిలిచారని, అనంతరం అతనికి మద్యం తాగించి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారని వారు ఆరోపించారు. గతంలో కూడా చందును కొందరు వ్యక్తులు తీవ్రంగా బెదిరించినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..

ఈ దారుణ ఘటనకు సంబంధించి గడ్డం శివ, గడ్డం భీష్మ, పంగ నాగరాజు, పంగ కమలాకర్, పంగ నారాయణ, పంగ సుధాకర్, పంగ ఉమాపతి, పంగ రవి, పంగ ప్రేమ్‌కుమార్ తదితరులపై అనుమానం ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు క్షేత్రస్థాయిలో సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధికార ప్రతినిధి నార్మెట యాదగిరి, నూనె తిలక్, మండల కమిటీ సభ్యులు మైసి సుజాత, అలవాల కళ్యాణి, గండికోట సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 1న డిల్లీకి తరలిరావాలి

- ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఉద్యమం
- ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది తరలిరావాలి
- రవీంద్ర దాస్ పిలుపు

కలంజ్యోతి, నాగర్ కర్నూల్ (అక్టోబర్ 26) : ఎన్నికల సంఘం వివాదాస్పద నిర్ణయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సేవ్ డెమోక్రసీ, సేవ్ కాన్‌స్టిట్యూషన్ పేరిట ఉద్యమం చేస్తున్నారని ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జి రవీంద్ర దాస్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారని, మొత్తం 25 కోట్ల ఓట్లను తొలగించాలన్నదే బీజేపీ కుట్ర అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోనూ 93 లక్షల ఓట్లు తొలగించారని, ఇది అత్యంత అన్యాయమని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఓట్ల తొలగింపు బీజేపీ కుట్ర..

కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్రస్థాయికి వెళ్లి ఎన్నికల సంఘం తీరును, రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అక్రమంగా తొలగించిన ఓట్ల వివరాలను సేకరించి డీసీసీ కమిటీలకు అందజేయాలని, ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలోనే ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. దళితులు, పేదలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారనే ఉద్దేశంతోనే వారి ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు.

ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది తరలాలి..

మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో 93 కోట్లుగా ఉన్న ఓట్లు, 2019 నాటికి 87 కోట్లకు చేరాయని, ప్రస్తుతం ఆ సంఖ్య 79 కోట్లకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో జనాభా పెరుగుతున్నప్పటికీ ఓటర్ల సంఖ్య మాత్రం తిరోగమనంలో పయనించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ నవంబర్ 1న డిల్లీలో నిర్వహించే భారీ ఆందోళన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కనీసం 500 మంది నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అచ్చంపేట, నాగర్ కర్నూల్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 26.10.2026
4
www.kalamjyothi.com



కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిని మల్లేశం
- బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమం
- కార్యకర్తల సమన్వయానికి ప్రత్యేక సమావేశం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 25) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామంలోని 5వ వార్డు ఈదులకంటిపల్లెలో భారతీయ జనతా పార్టీ 297వ బూత్ ఆధ్వర్యంలో ఆదివారం టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలను వివరించడంతో పాటు బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త నిరంతరం కృషి చేయాలని సూచించారు.

కార్యకర్తల సమన్వయానికి ప్రత్యేక సమావేశం..

టిఫిన్ బైఠక్ ద్వారా కార్యకర్తల మధ్య పరస్పర సమన్వయాన్ని పెంపొందించడంతో పాటు రాబోయే పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట బీజేపీ మండల అధ్యక్షుడు భూమాల అనిల్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మారవేణి దివ్య, సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొలనూరు ముత్తవ్వ, మండల నాయకురాలు అల్వాల భారతి, మాజీ అధ్యక్షుడు నాగ సముద్రాల సంతోష్, శ్రీనివాస్ నాయక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి పొన్నం కృష్ణ, దాచారం బూత్ అధ్యక్షుడు మారవేణి రాజు, శ్రీశైలం, ఉప్పుల జీవన్ రెడ్డి, రెడ్డవేణి నర్సింగం, రగుడు దేవరాజ్, మ్యాకల మల్లేశం, బూసిరెడ్డి, బాల్‌రెడ్డి, కళ్లెం రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మిత్రుడికి బుగ్గ కృష్ణమూర్తి పరామర్శ



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : చిన్ననాటి మిత్రుడిని తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన కేశెట్టి వేణు, బుగ్గ కృష్ణమూర్తి శర్మ చిన్నతనం నుంచి కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఇటీవల కేశెట్టి వేణు తీవ్ర అనారోగ్యానికి గురై నిజామాబాద్‌లోని పవన్ న్యూరో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కృష్ణమూర్తి శర్మ నేరుగా ఆసుపత్రికి వెళ్లి వేణును పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తన మిత్రుడు వేణు త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

తుది దశకు వేములవాడ రోడ్డు విస్తరణ పనులు

- నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి
- రాజన్న ఆలయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు, భక్తులు ఎదురుచూస్తున్న రహదారి విస్తరణ పనులను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆది శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వేములవాడ పట్టణంలో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. రాజన్న ఆలయాన్ని రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలి..

ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే భక్తుల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి పనులు, రహదారి నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా జాప్యం లేకుండా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



వైద్యుడు సదానందం మృతి తీరని లోటు

- ప్రజలకు సేవలందించిన మహనీయుడు
- బీఆర్ఎస్ నాయకుడు నామాల సత్యనారాయణ

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 25) : నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన ప్రముఖ ప్రజా వైద్యుడు మాటేటి సదానందం మృతి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తీరని లోటని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నామాల సత్యనారాయణ అన్నారు. మాటేటి సదానందం అకాల మరణం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులతో కలిసి సదానందం పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా గ్రామీణ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలందించిన సదానందం మరణం తీరని వేదన మిగిల్చిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింగం, క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి, మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, మాజీ సర్పంచ్ పోటు రాయపురెడ్డి, బండారి చిన్న వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, వార్డు సభ్యుడు గజ్జి రాము, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



దండు శ్రీనివాస్‌కు ఘన సన్మానం

ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకంపై అభినందనలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : రాచర్ల-బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దండు శ్రీనివాస్‌కు తోటి నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆయన నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారి బాల్‌రెడ్డి ఆయనకు శాలువా కప్పి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజా సేవలో, పార్టీ అభివృద్ధిలో శ్రీనివాస్ మరింత చురుగ్గా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం మండల మాజీ అధ్యక్షుడు రఫీక్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొని నూతన ఏఎంసీ డైరెక్టర్ దండు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
సోమవారం 26.10.2026
www.kalamjyothi.com

సిరిసిల్ల కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు

- నామినేటెడ్ పదవుల కేటాయింపుపై అసహనం
- కష్టపడిన వారికి మొండిచేయి చూపుతున్నారంటూ విమర్శలు
- అక్రమ కేసుల ఎత్తివేతకు చొరవ చూపాలి


కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల పంపిణీ తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్న తరుణంలో మార్కెట్ కమిటీ సహా ఇతర కీలక పదవుల కేటాయింపుల్లో క్షేత్రస్థాయి కార్యకర్తలను విస్మరిస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం జెండాలు మోసి, నాయకుల పిలుపు మేరకు ఆందోళనలు చేపట్టి, కేసులు ఎదుర్కొన్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు దక్కడం లేదని పార్టీ శ్రేణులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

కష్టపడిన వారికి మొండిచేయీ అంటూ విమర్శ..

ఏళ్ల తరబడి సేవలందించిన అసలైన కార్యకర్తలకు కాకుండా, ఇతర పార్టీల నుంచి చేరిన వారికి, సంస్థాగత బలోపేతానికి ఏమాత్రం కృషి చేయని వారికి పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదవుల ఎంపికలో ప్రజాదరణ, పార్టీ విధేయత, చేసిన సేవలకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. కొందరు నాయకుల వ్యవహార శైలి వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతోందని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సంస్థాగత ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని క్షేత్రస్థాయి శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

అక్రమ కేసుల ఎత్తివేతకు చొరవ చూపాలి..

గత ప్రభుత్వ హయాంలో పార్టీ తరపున నిర్వహించిన ప్రజా పోరాటాల వల్ల కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయించేందుకు నాయకత్వం తక్షణమే చొరవ చూపాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యకర్తలను కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం చేయకుండా, సమస్యలు ఎదురైనప్పుడు అండగా నిలవాలని కోరుతున్నారు. కష్టపడే శ్రేణులకు సముచిత స్థానం కల్పించకుంటే భవిష్యత్తులో పార్టీ నిర్మాణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని, అధిష్ఠానం జోక్యం చేసుకుని తగిన న్యాయం చేయాలని స్పష్టం చేస్తున్నారు.







28న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

రథోత్సవం

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

సంగీతం శ్రీనివాస్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట : సిరిసిల్ల పట్టణంలో ఈ నెల 28వ తేదీన సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తెలిపారు. ఈ పవిత్ర ఆధ్యాత్మిక వేడుకకు సిరిసిల్ల పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఆయన కోరారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించే రథోత్సవంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి సేవలో తరించాలని పిలుపునిచ్చారు. రథోత్సవాన్ని విజయవంతం చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిమళింపజేయాలని ఆకాంక్షించారు. గోవిందా గోవిందా, శ్రీ వెంకటేశ్వర గోవిందా, శ్రీనివాస గోవిందా నామస్మరణతో రథోత్సవంలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని సంగీతం శ్రీనివాస్ భక్తులకు విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్యం

ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శిబిరం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : వేములవాడ మున్సిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో అహర్నిశలు శ్రమిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికుల శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పురపాలక సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వైద్య రంగంలో దోపిడీ అరికట్టాలి

సిరిసిల్ల జిల్లా ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : వైద్య సేవలు, మందులు, పరికరాల పేరిట సామాన్యులపై మోపుతున్న అధిక ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని సిరిసిల్ల జిల్లా ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్లో మందులు, పరికరాల అసలు ధరకు, ఆసుపత్రుల్లో విక్రయిస్తున్న ధరకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని సమితి ఒక ప్రకటనలో ఆరోపించింది. అత్యవసర సమయాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి కొనుగోలు చేస్తున్నాయని, ఈ దారుణ దోపిడీపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు.

అసలు ధరకు, అమ్మకానికి భారీ వ్యత్యాసం..

ఆసుపత్రుల్లో వసూలు చేస్తున్న దోపిడీ ధరల వివరాలను సమితి బహిర్గతం చేసింది. మార్కెట్లో రూ.20 ఉండే ఐవీ సెట్‌ను రూ.450కి, రూ.25 ఉండే ఐవీ క్యాన్యులాను రూ.250కి, రూ.200 ఉండే పిల్లల ఆక్సిజన్ మాస్క్‌ను ఏకంగా రూ.4,000కు అమ్ముతున్నారని పేర్కొంది. రూ.70 ఉండే నెబ్యులైజర్ మాస్క్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారని తెలిపింది. అలాగే రూ.45 ఉండే పోడోసెఫ్ మందును రూ.200కు, రూ.20 విలువైన పాన్‌సాల్వ్ డీఎస్ఆర్‌ను రూ.186కు, రూ.15 ఉండే మూవిజ్‌ను రూ.182కు, రూ.10,000 ఉండే న్యూరో ఇంజెక్షన్‌ను రూ.40,000కు విక్రయిస్తున్నారని, వీటికితోడు ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు పిల్లలకు ఆక్సిజన్ అందించేందుకు గంటకు రూ.500 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి..

మందులు, వైద్య పరికరాల తయారీ వ్యయం, గరిష్ఠ చిల్లర ధరలు (ఎంఆర్‌పీ), ఆసుపత్రుల్లో వసూలు చేస్తున్న మొత్తాలను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సమితి కోరింది. ఆసుపత్రుల్లో ధరల పట్టికలను ప్రజలకు కనిపించేలా పారదర్శకంగా ఏర్పాటు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేసే యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటు ధరల్లో లభించేలా పర్యవేక్షణ పెంచాలని స్పష్టం చేసింది.



గట్టెపల్లి భూమయ్యకు ఘన నివాళి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 25) : మూడు పర్యాయాలు వెంకటాపూర్ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి ప్రజలకు విశేష సేవలందించిన సీనియర్ కమ్యూనిస్టు యోధుడు గట్టెపల్లి భూమయ్య మృతి పట్ల బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యం, వయోభారంతో కన్నుమూసిన భూమయ్య పార్థివదేహాన్ని ఆదివారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన భూమయ్య మరణం తీరని లోటని అన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన అందించిన సేవలు ఎల్లప్పుడూ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు.

భూమయ్య కుటుంబానికి అండగా ఉంటాం..

అనంతరం భూమయ్య కుమార్తె, మాజీ సర్పంచ్ బుర్క భాగ్యను తోట ఆగయ్య పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరస కృష్ణహరి, ఉద్యమకారుడు, సర్పంచ్ అందె సుభాష్, సర్పంచ్ ఎలగందుల నరసింహులు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్, మాజీ ఎంపీటీసీ నమలికొండ శ్రీనివాస్, నాయకులు మామిండ్ల తిరుపతి, పిల్లి కిషన్ తదితరులు పాల్గొని గట్టెపల్లి భూమయ్యకు ఘనంగా నివాళులర్పించారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

'వ్యూహకర్మ' చిత్రంలో అద్భుత అనుభవం

అక్కినేని నాగచైతన్య హీరోగా క్రిష్ దండు దర్శకత్వంలో వస్తున్న 'వ్యూహకర్మ' చిత్రంలో నటించడం తనకు అద్భుతమైన అనుభూతినిచ్చిందని కథానాయిక ఖుషీ చెదరి తెలిపారు. బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ డిసెంబర్ 4న విడుదల కానుంది. చిత్ర యూనిట్ తీర్చిదిద్దిన భారీ గుహ సెట్‌ను సందర్శించిన ఖుషీ యూనిట్‌తో ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు ఎవరూ చూడని విధంగా సరికొత్త ప్రపంచాన్ని ఇందులో సృష్టించారని, కథలోని పాత్రల ఆధారంగా తెరకెక్కించిన తీరు నిజ జీవిత అనుభూతిని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తన సినీ కెరీర్‌లోనే ఇది అత్యంత కీలక చిత్రంగా నిలుస్తుందని ఆమె వివరించారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.